క్లుప్తంగా

కమిషనర్ అలీమ్ బాషా బాధ్యతల స్వీకరణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ నూతన కమిషనర్ అలీమ్ బాషా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఎస్.ప్రకాష్‌రావు, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీసీపీ అశోక్ కుమార్, నగరపాలక సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అలీమ్ బాషా 1996 ఏపీపీఎస్‌సీ–1 గ్రూప్ బ్యాచ్‌లో మున్సిపల్ కమిషనర్ గ్రేడ్ 2కు ఎంపికయ్యారు. కడప జిల్లా, పల్నాడు జిల్లా నరసరావుపేటలో కమిషనర్‌గా, నెల్లూరు, కాకినాడ నగరపాలక సంస్థల్లో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఏపీ సీఆర్‌డీఏలో అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సమస్యలపై దృష్టి సారించే విధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన నగరపాలక సంస్థ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

తాడేపల్లి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులోని అపర్ణ క్లబ్ హౌస్‌లో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్‌స్టలేషన్ ఆఫీసర్, రోటరీ ఇంటర్నేషనల్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడిగా రావూరి రమేష్ బాబు, కార్యదర్శిగా సుకుమార్‌రెడ్డి, కోశాధికారిగా రవీంద్రరెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్స్ ఎం.వంశీకృష్ణ, పీడీజీ అన్నే రత్నప్రభాకర్, పబ్లిక్ ఇమేజ్ కోచ్ చైర్మన్ అనిల్ చక్రవర్తి, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి మాజీ అధ్యక్షుడు కిరణ్ పరుచూరి, మాజీ కార్యదర్శి చంద్ర ఓబులా రెడ్డి, మాజీ కోశాధికారి గోపు నాగ రాజేష్, కాట్రగడ్డ శివన్నారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా దర్బార్

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి నారా లోకేష్ ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నారు. గత రెండు రోజుల నుంచి ఆ కార్యక్రమం వాయిదా పడింది. తిరిగి మరల ప్రజా దర్బార్‌ను బుధవారం నిర్వహించనున్నట్లు ఆయన కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఉన్న తన నివాసం వద్ద ఉదయం 6 నుంచి 7 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

డ్రెయినేజీ పూడిక తీత

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం కొలనుకొండ మధ్య ఉన్న కచ్చ డ్రెయిన్ పూడికతీత పనులు మంగళవారం కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టారు. వడ్డేశ్వరం ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ మాట్లాడుతూ.. ఈ డ్రెయిన్ ద్వారా వడ్డేశ్వరం కొలనుకొండలోని కొంత మేర మురుగు నీరు, వర్షపు నీరు బయటకు వెళ్తుందని తెలిపారు.

అట్రాసిటీ యాక్ట్‌పై ప్రచారం చేయాలి



తాడేపల్లిరూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌పై మంగళగిరి మండలంలో విస్తృతంగా ప్రచారం చేయాలని మంగళవారం ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర అధ్యక్షుడు కారుమంచి రామరావు మంగళగిరి తహసీల్దారు నాగేశ్వరరావుకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రతి నెలా 30న జరగాల్సిన పౌరహక్కుల దినోత్సవం మంగళగిరిలో జరగడం లేదని తెలిపారు. దళిత చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించి, దళితులపై దాడులను నివారించాలని తహసీల్దారును కోరామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్మీ ట్రస్ట్ సెక్రటరీ పాల్గొన్నారు.

తక్కువ ధరకు నాణ్యమైన సరకులు

తెనాలి: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వినియోగదారుల సౌలభ్యం కోసం నాణ్యమైన స్టీమ్ బియ్యం, బియ్యం, కందిపప్పును డివిజనులోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లలో తక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణంలోని గాంధీపార్కు, గంగానమ్మపేట, మంగళగిరిలో వ్యవసాయ మార్కెట్‌యార్డు పక్కన, పొన్నూరు రైతుబజార్లలో ఈ కౌంటర్లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేషనల్ హెల్త్ మిషన్ అడిషనల్ సెక్రటరి యూపీహెచ్‌సీ సందర్శన



కంప్యూటర్‌లో నమోదు చేసిన రికార్డుల వివరాలను తెలుసుకుంటున్న నేషనల్ హెల్త్ మిషన్ అడిషనల్ సెక్రటరి ఆరాధన పట్నాయక్

తాడేపల్లిరూరల్: ప్రకాష్‌నగర్, అంబేడ్కర్ నగర్ (డ్రైవర్స్ కాలనీ)లోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను మంగళవారం కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యాలయం నేషనల్ హెల్త్ మిషన్ అడిషనల్ సెక్రటరి ఆరాధన పట్నాయక్ సందర్శించారు. 12 విభాగాల్లో అందిస్తున్న సేవలు, రికార్డుల కంప్యూటరీకరణ తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులను, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్, రూరల్ హెల్త్ సెంటర్లు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. గతంలో ఇక్కడ ఉన్న హెల్త్ సెంటర్ జాతీయ నాణ్యత ప్రమాణాలు హామీకి తగినట్లుగా కేంద్ర నిర్వహణ విధానానికి గాను అత్యధిక మార్కులు సాధించిందన్నారు. ఇటీవల రాష్ట్ర వైద్యాధికారులు, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఢిల్లీలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిత్వ కార్యాలయంలో ఆ ప్రశంసా పత్రం అందుకున్నారని తెలిపారు. ఈ అర్హతా పత్రాలు పొందిన అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పటి వరకు అవే ప్రమాణాలు కొనసాగిస్తున్నాయా.. లేదా అని తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ జె.విజయలక్ష్మి, హెచ్‌డబ్ల్యుసీ శ్యామల, స్టేట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ దేవి, యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మానస, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రత్నం మన్మోహన్, డీపీఎం సైమన్, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గురుకుమార్, మలేరియా ఆఫీసర్ శ్రీమన్నారాయణ, హెచ్‌వీ రమాదేవి, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మంత్రి నారాయణతో జీఎంసీ కమిషనర్ భేటీ



సమావేశంలో మంత్రి నారాయణకు సమస్యలు వివరిస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో గుంటూరు నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై కమిషనర్ కీర్తి చేకూరి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్, ఇతర అధికారులతో మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరంలో పారిశుద్ధ్యం, శివారు ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, రోడ్ల సమస్యలపై చర్చించారు. మొండి గేటు డ్రెయిన్ రైల్వే ట్రాక్ క్రాసింగ్, అగతవరప్పాడు డ్రెయిన్లు పొంగడం, కల్వర్టుల కింద పూడిక తీత అంశాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ కోరారు. తూర్పు నియోజకవర్గంలో ఈ–ఆటోల ద్వారా చెత్త సేకరణ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌ని మంత్రి ఆదేశించారు. రెండు రోజుల్లో కార్పొరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలో ఉన్న ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మతులకు కూడా ప్రజా సౌకర్యార్థం కార్పొరేషన్ అధికారులు మరమ్మతులు చేయాలన్నారు. నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు త్వరలో పారిశుద్ధ్య పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రికి కమిషనర్ వివరించారు. అదేవిధంగా నగరంలో డ్రెయిన్లలో పూడికతీత పనులపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం డ్రెయిన్లు పొంగే అవకాశం ఉన్నందున పూడిక తీతపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను ఆదేశించారు.

వసతి గృహాల్లో దోమల నివారణకు ఫాగింగ్



తాడికొండ: వసతి గృహాలు, నివాసిత ప్రాంతాల్లో దోమల నివారణకు పంచాయతీ అధికారులు మంగళవారం ఫాగింగ్ చేపట్టారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో భాగంగా బీసీ బాలికల వసతి గృహం, జెండా చెట్టు బజారులో పారిశుద్ధ్యాన్ని పరిశీలించి, ఫాగింగ్‌కు ఆదేశించినట్లు పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మేడికొండూరు: మండలంలోని పేరేచర్లలో గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. సుమారు 30 సంవత్సరాల లోపు వయసు కలిగి వ్యక్తి మృత దేహం నరసరావుపేట రోడ్డులోని సేకరణ హార్డ్ హైస్కూల్ సమీపంలో పడి ఉంది. నల్ల గళ్ల చొక్కా, ఎర్ర ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసినవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని మేడికొండూరు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్ సీఐ డి.జైకుమార్ 86888 31380 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

పేదలకు బియ్యం అందజేత

తెనాలి అర్బన్: యడ్లలింగయ్య కాలనీ, పూలే కాలనీలోని పేద యానాదులకు మంగళవారం బియ్యం, పరదాలను పంపిణీ చేశారు. ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ రావూరి అంజలి మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో పట్టాలను 20 మందికి పంపిణీ చేసినట్లు చెప్పారు. వలంటీర్లు పాల్గొన్నారు.

జన నాయక్ కర్పూరి ఠాకూర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత రత్న ''జన నాయక్ కర్పూరి ఠాకూర్'' విగ్రహ ఏర్పాటుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం కర్పూరీ ఠాకూర్ ఫౌండేషన్ సభ్యులు మేయర్‌ను సంపత్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. కర్పూరీ ఠాకూర్ విగ్రహాన్ని గుంటూరు నగరంలో ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కర్పూరి ఠాకూర్ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 26 నెలలు జైలు జీవితం గడిపారన్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా పని చేశారని తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని ట్రాఫిక్ సమస్య లేని ప్రాంతంలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ పీవీ రమణయ్య, ట్రెజరర్ కె.దేవి ప్రసాదరావు, ఈసీ మెంబర్ బాల తాత పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: పట్టణంలో మురుగు కాల్వల పూడికతీత, ఆక్రమణల తొలగింపు పనులు స్పెషల్ డ్రైవ్ కింద నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బోసు రోడ్డులో మంగళవారం ఆక్రమణల తొలగింపును ఆయన పరిశీలించారు. వ్యాపారులు కొందరు అడ్డుకోవడంతో వారితో మాట్లాడి పనిని కొనసాగించారు. మురుగు కాల్వల మీద ఉన్న బండ్లను, ఫ్లోరింగ్‌ను జేసీబీతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మురుగు కాల్వలోని పూడికతీత పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. అనంతరం 27వ వార్డులో పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, పలువురు టౌన్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

తెనాలి అర్బన్: దోమలు కుడితే పెద్ద రోగాలు వస్తాయని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వీటిని అరికట్టవచ్చని మలేరియా విభాగ తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పేర్కొన్నారు. పట్టణంలోని చినరావూరుతోటలో మంగళవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటి ఆవరణలో నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకున్నారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వల్లో నీరు సక్రమంగా పారేలా చూడాలన్నారు. వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ షేక్ రషీద్, శానిటరీ సెక్రటరీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మద్భగవద్గీత ధారావాహిక ప్రవచనం ప్రారంభం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం రాత్రి మాటూరి జగన్మోహనరావు, చెన్నలక్ష్మి దంపతుల సౌజన్యంతో శ్రీమద్భగవద్గీతలోని అక్షర బ్రహ్మయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పూజ్యశ్రీ సువీరానంద స్వామి (చిన్మయ మిషన్) ప్రసంగిస్తూ మనస్సు వేరే ధ్యాస లేకుండా నిరంతరం పరమేశ్వరుని ధ్యానరూపమై సాధన చేసిన మానవుడు దివ్యపురుషుడైన పరమాత్మను చేరునని పేర్కొన్నారు. నిశ్చలమైన మనస్సుతో నిరంతరం ధ్యానం చేసిన పరమాత్ముని చేరొచ్చునని భక్తులకు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులపై కేసు కొట్టివేత

తెనాలి రూరల్: ప్రభుత్వ ఉద్యోగులపై నమోదైన కేసులో దర్యాప్తు సరిగా లేని కారణంగా తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పవన్‌కుమార్ కేసును కొట్టివేశారు. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్‌హెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గోవాడ వీఆర్‌వోపై అమృతలూరు పోలీస్‌స్టేషన్‌లో 2016లో సీఎఫ్‌ఆర్ కేసు నమోదైంది. రేషన్ డీలర్‌షిప్‌కు సంబంధించిన కేసును కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు నమోదు చేశారు. కేసు మంగళవారం విచారణకు వచ్చిన పరిశీలించిన న్యాయమూర్తి దర్యాప్తు సరిగా లేదని గుర్తించారు. దీంతో కేసును కొట్టివేస్తూ ఇదే విషయమై బాపట్ల జిల్లా ఎస్పీకి లేఖ రాయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు న్యాయశాఖ సిబ్బంది తెలిపారు.

ప్రతి ఒక్కరికి కార్మెల్ మాత దీవెనలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కార్మెల్ మాత ఉత్సవాల్లో ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ మంగళవారం పాల్గొన్నారు. కార్మెల్ కొండ వద్దకు వచ్చి దిగువన ఉన్న కార్మెల్ మాత స్వరూపం వద్ద కొబ్బరి కాయ కొట్టి ప్రార్థనలు చేశారు. ప్రతి కుటుంబానికి కార్మెల్ మాత దీవెనలు ఉండాలని కోరుకున్నారు. పూజల్లో బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట మండవ నరసింహారావు, స్థానిక నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ కృతజ్ఞత పాదయాత్ర

తాడికొండ: తుళ్ళూరు మండలం దొండపాడు, బోరుపాలెం, హరిశ్చంద్రాపురం గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కృతజ్ఞత పాదయాత్ర నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించినందుకు గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు కట్టా నరసింహ, కొమ్మినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం జిల్లాస్థాయి విస్తృత సమావేశం

లక్ష్మీపురం: స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా స్థాయి విస్తృత సమావేశం బుధవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సి.హెచ్.బాబురావు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, మండల, పట్టణ కమిటీ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సమావేశం

స్థానిక కొత్త పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొంటారని పేర్కొన్నారు.

వంతెనల నాణ్యతపై దర్యాప్తు జరిపించాలి



లక్ష్మీపురం: ఒక వంతెన కూలితేనే ఎంతో ఆశ్చర్యం కలుగుతుందని అటువంటిది బిహార్‌లో ఇప్పటికి పద మూడు వంతెనలు కూలిపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని, దీనిపై అవగాహన సంస్థ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు వారాల్లో పది వంతెనలు ఒకదాని తరువాత ఒకటి కూలిపోయాయని, ఇంజనీర్ల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే వారధులు కూలుతున్నాయన్నది స్పష్టం తెలుస్తోందన్నారు. బ్రిడ్జిలు కూలిపోవడంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా ఉండాలంటే ప్రధాని మోదీ విస్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని శివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ప్రశ్నే లేదని విశాఖపట్నం పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మీడియా సమావేశంలో పేర్కొనడం సంతోషకరమన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఉప సంహరింప జేయటం తెలుగుదేశం పార్టీ ధర్మమని తెలిపారు.

పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలి



వినతిపత్రం సమర్పించిన యూటీఎఫ్ సభ్యులు ఆదిలక్ష్మి, కళాధర్

గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మికి యూటీఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్నయ్య, కె.ప్రభూజీ విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్‌ను కలసిన యూటీఎఫ్ నాయకులు ఆమెకు వినతి పత్రం అందజేశారు. కుటుంబ అవసరాలు, అనారోగ్య సమస్యలతో పాటు పిల్లల చదువులు తదితర భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న పీఎఫ్ సొమ్ముపై రుణాలు మంజూరు కాకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీవో నంబరు 84 ద్వారా మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్, పరిపాలన బాధ్యతలను డీఈవో, ఎంఈవోలకు బదిలీ చేయడం వల్ల ఉపాధ్యాయులు గత రెండేళ్లుగా పీఎఫ్ ఖాతాల నుంచి రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని అదనపు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఏసీ మాట్లాడుతూ.. పీఎఫ్ ఖాతాల నుంచి రుణాలు మంజూరు చేస్తామని, అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.కళాధర్, నాయకులు బాజీబాబా, వెంకటేశ్వర్లు, బి.ప్రసాద్, ఎ.ప్రసాద్ ఉన్నారు.

నూతన బస్సులు ప్రారంభం



ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు శ్రీనివాసరావు, ఎంవీఎస్ రామకృష్ణ, అబ్దుల్ సలాం, సత్యనారాయణ, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పట్నంబజారు: ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు డిపో పరిధిలో మంగళవారం నూతనంగా రెండు బస్సులను ప్రారంభించారు. అల్ట్రా డీలక్స్ బస్సుల ప్రారంభానికి గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, జోన్ త్రీ ఈడీ ఆదాం సాహెబ్, గుంటూరు రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్‌తో పాటు ఇతర అధికారులు కలిసి బస్సులను ప్రారంభించారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్సులు ప్రారంభించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల రద్దీగా అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

విద్యుత్ చౌర్యం.. రూ.21 లక్షల అపరాధ రుసుం

విద్యుత్ శాఖ అధికారుల విస్తృత తనిఖీలు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖలో డీ–6 సెక్షన్ పరిధిలోని ఏటీ అగ్రహారం, కన్నవారితోటలో మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.సూర్యప్రకాష్, శ్రీనివాసులుబాబు పర్యవేక్షణలో 58 మంది అధికారులు, 120 మంది సిబ్బంది 58 బృందాలుగా ఏర్పడి 4,608 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న 205 మందికి రూ.10.81 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన కేటగిరికి కాక ఇతర కేటగిరిలో విద్యుత్తు వాడుతున్న ఐదుగురికి రూ.70 వేలు జరిమానా విధించారు. అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుకున్న 200 మందికి రూ.10.11 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, బి.రాజమోహన్, ఏఈలు కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఎస్.వెంకటేశ్వర్లు ఇతర అధికార సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక కుటుంబానికి పరామర్శ

గుంటూరు మెడికల్: చేబ్రోలుకి చెందిన 7వ తరగతి విద్యార్థిని అనుమానాస్పద మృతిపై బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లీశ్వరీ స్పందించారు. మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చిన్నారి మేనత్త మాట్లాడుతూ.. నిందితుడిని త్వరగా పట్టుకొని ఉరితీయాలని, అప్పుడే తమకు న్యాయం జరిగినట్లని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నాగమల్లీశ్వరీ వారికి సత్వరం న్యాయం జరిగేలా తమవంతు ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఉపాధ్యక్షురాలు సైదా రాణి , కోశాధికారి డాక్టర్ స్రవంతి, కార్యదర్శి మహాలక్ష్మి తదితరులు పరామర్శించారు.

విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం

గుంటూరు ఈస్ట్: పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలిసిన సమాచారం మేరకు... గుంటూరు రూరల్ మండలం బుడంపాడు సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నారు. వీరికి మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపంతో తలకు రాసుకునే వజ్మల్ గత ఐదు రోజుల కిందట తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వారిని కళాశాల నిర్వాహకులు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.